ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 59 ఫిర్యాదులు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ప్రతి సోమవారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 59 ఫిర్యాదులు వచ్చినట్టు సీపీ శంఖబ్రాత బాగ్చి తెలిపారు. బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజా ఫిర్యాదుల పరి ష్కారంలో అలసత్వం చేస్తే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. కుటుంబ

కలహాలు, భూ వివా దాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి, సివిల్ కేసుల విషయంకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. పోలీసు ఉన్నతాధికారులు ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్ట పరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించ వలసినదిగా ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్‌తోపాటు జాయింట్ కమిషనర్ కే.ఫక్కీరప్ప, నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు, పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

వర్షం ధాటికి వేములవలస అస్తవ్యస్తం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో గల వేములవలస పంచాయతీకి మంచి పేరు ఉంది. ఎందుకంటే పూల మార్కెట్, కూరగాయల మార్కెట్ ఇక్కడ ఉండటంతో చాలా గొప్పగా చెప్పుకుంటారు. అయితే పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా పరిస్థితులు కనబడుతున్నాయి. చిన్నపాటి వర్షం పడిన చెత్తాచెదారాలు ఇతర

వ్యర్థాలు కొట్టుకురావడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఇటీవల పడిన భారీ వర్షాలకు పూల మార్కెట్ నుండి వేముల వలసకు వెళ్లే రహదారి డ్రైనేజీతో చాలా అధ్వాన్నంగా తయారయింది. ఒక ప్రక్క నీటి ప్రవాహానికి రోడ్లు కోత, మరోపక్క స్టేట్ బ్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్త చెదారంతో స్థానిక వ్యాపారస్తులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే లోతట్టు ప్రాంతం కావడం వల్ల మురుగునీరు గుంతల్లోకి చేరి ఈగలు దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక పంచాయతీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ సోమవారం పలు చోట్ల క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ పాత్ వే ఇక్కడ చాలా అవసరం అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై పంచాయతీలో అందరి సమక్షంలో తీర్మానం చేస్తామన్నారు. ఈ సమస్యను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్, మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం కోరుతానని స్థానికులకు హామీని ఇచ్చారు.

గరికపాటి రాజారావు 61వ వర్ధంతి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు 61వ వర్ధంతి సభను సోమవారం కూర్మన్నపాలెం దీక్షా శిబిరంలో నిర్వహించారు. ప్రజానాట్యమండలి ఉక్కునగరం డివిజన్ కార్యదర్శి కృష్ణార్జున అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పూర్వ ప్రజానాట్యమండలి కళాకారులు, సీనియర్ నాయకులు

ఎన్.రామారావు గరికపాటి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రామారావు మాట్లాడుతూ గరికపాటి రాజారావు డాక్టర్ వృత్తిని వదిలి ప్రజా శ్రేయస్సు కోసం ఉద్యమ బాటను పట్టి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి ప్రజా పోరాటాలలో భాగముగా ప్రజానాట్యమండలి సంస్థను స్థాపించి క్రొత్త ఒరవడిని సృష్టించారన్నారు. అనేక మంది కళాకారులను సినీరంగానికి పరిచయం చేశారు అని చెప్పారు. స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ ఈనాటి ప్రభుత్వాలు పెట్టుబడిదారీ వ్యవస్థకు కొమ్ము కాస్తున్నారని దుయ్యబట్టారు. ఆనాడు బ్రిటిష్ వారు మన దేశం విడిచి పోయిన తరువాత నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ మన దేశాన్ని, మన ప్రభుత్వాన్ని పూర్తిగా వారి చెప్పు చేతల్లో పెట్టుకొని ప్రజలను వేధిస్తున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో మన దేశం ఎటుపోతుందోనని ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, సోషల్ మీడియా క్రియేటివ్ హెడ్ డిహెచ్.వెంకటేశ్వరరావు, కూన వెంకట రావు, బి.అప్పారావు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు పి.రాంబాబు, ఎం.గౌరీశంకరరావు, భాస్కర్, నాగలింగం, కె.అప్పారావు, అంజి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపై పొంచివున్న ప్రమాదం

విశాలాంధ్ర-గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం వరహాలక్ష్మినృసింహ స్వామివారి కొండపై ఉపయోగంలో లేని గిరిజన కాలనీ వద్ద ఆలయంకు ప్రమాదం పొంచి ఉంది. కొండపై కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ పనులకు సంబంధించిన మట్టిని, రాళ్ళ హిల్ టాప్ రోడ్ ప్రక్కన కొండవాలు ప్రాంతంలో కనీస భద్రత లేకుండా పెద్ద పెద్ద లారిలతో వేశారు. అదికాస్తా ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి, రాళ్ళ ఇరుకుల్లో వర్షపు నీరు చేరింది. తద్వారా రాళ్లతో కూడిన మట్టి జారిపోయే ప్రమాదం ఉంది. దీనివలన ఆలయ ప్రహరీతో పాటు పాకశాల దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. దేవస్థానం అధికారులు సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని భక్తులు, కొండపైన గిరిజన గ్రామస్తులు, సిబ్బంది వేడుకుంటున్నారు.

సరుకు రవాణాలో పోర్ట్ మరింత కృషి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టులో సోమవారం విశాఖ పార్లమెంటు సభ్యులు శ్రీ భరత్ పర్యటించారు. పోర్టు చైర్ పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఎంపీ శ్రీ భరత్‌కు సాదర స్వాగతం పలికారు. విశాఖపట్నంలో అభివృద్ధి చేయవలసిన అంశాలపైన సమావేశంలో శ్రీ భరత్ ప్రధానంగా ప్రస్తావించారు. ముఖ్యంగా విశాఖకు రోడ్డు రైలు కనెక్టివిటీకి సంబంధించిన అంశాలను మెరుగుపరచడంతోపాటుగా విశాఖ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు తీసుకోవలసిన చర్యల పైన సమావేశంలో చర్చించారు. సరుకు రవాణాను మరింత మరింత వేగవంతం చేసేందుకు మౌలిక వసతులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని వన్‌టౌన్ ప్రాంతంలో కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీ పోర్టు యాజమాన్యాన్ని కోరారు. విశాఖపట్నం నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడంలో భాగంగా పోర్టులో పలు పనులు చేపడతామని పోర్ట్ యాజమాన్యం తెలిపింది. ఈ సమావేశంలో డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, వివిధ విభాగాధిపతులు ఇతర ఉన్నతా ధికారులు పాల్గొన్నారు. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ ఉన్నారు.

కైలాసగిరి కొండపై బస్సు ప్రమాదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బ్రేక్స్ ఫెయిల్యూర్ కావడంతో కైలాసగిరి కొండ పైకి వెళ్తున్న ఓ ప్రైవేటు టూరిస్ట్ బస్సు ప్రమాదానికి గురైంది. పై నుండి మొదటి మలుపు తిరుగుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదం జరగకుండా పక్కన ఉన్న గోడకు డ్రైవర్ బస్సును ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో 16 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారందరినీ చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఘటన స్థలాన్ని సీపీ బాగ్చి సందర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని కేజీహెచ్‌లో వైద్యులను కోరారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కొమ్మాది: గ్రేటర్ విశాఖ జోన్-2లోని 7వ వార్డు మధురవాడ చంద్రంపాలెంలో కొలువుతీరిన 33 అడుగుల భారీ గణనాథుని మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ముందుగా శ్రీ వరసిద్ధి వినాయకాయ స్వామి వారికి నిత్య పూజా కార్యక్రమాలు బ్రాహ్మణోత్తములచే జరిపించి అనంతరం వినాయక మండపంలో సోమవారం కావడంతో శివునికి ప్రత్యేకంగా రుద్రాభిషేకం జరిపించారు. రుద్రాభిషేకం కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో రుద్రాభిషేకం కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ భీమిలి డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.లక్ష్మిపతి దంపతులు తదితరులు 33 అడుగుల భారీ గణనాథుడు దర్శనం చేసుకోవడం జరిగింది. వారికి శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి స్వామివారి ప్రసాదం అందజేశారు.



53 మందిని పునరావాస కేంద్రాలకు తరలింపు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో వర్షాలు పడుతున్న దృష్ట్యా కొండవాలు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని, ప్రస్తుతం 45 మందిని జీవీఎంసీ ఏర్పాటుచేసిన పునరవాస కేంద్రాలకు తరలించామని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఆదివారం నగరం లో ఎడతెరపిలేని వర్షం కారణంగా 8వ జోన్ 91వ వార్డు పరిధిలోని రామకృష్ణ నగర్ సమీపంలో కొండవాలు యొక్క రక్షణ గోడ జారినందున ఆ ప్రాంతంలోని 38 మందిని అప్రమత్తం చేసి జీవీఎంసీ ఏర్పాటుచేసిన గోపాలపట్నం మండల ప్రజా పరిషత్ పాఠశాలకు తరలించగా వారు ఆశ్రయం పొందుతున్నారని, అలాగే జోన్-1 తగరపువలస పబ్లిక్ లైబ్రరీలో ఏడుగురును, జోన్-2 13వ వార్డులో జైభీమ్ నగర్ ప్రాంతం లో నున్న 8 కుటుంబాలు చెందిన 20 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి వసతితో పాటు భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యం మొదలైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. నగరంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ముందస్తుగా 80 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని, పునరవాస కేంద్రాలలో నున్న ప్రజలు ఆందోళనకు గురికాకుండా వారికి కౌన్సిలింగు చేస్తున్నామని ఆయన తెలిపారు. ముందస్తుగా పునరవాస కేంద్రాలకు ఆశ్రయం పొందేందుకు కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు జివిఎంసి అధికారులకు తెలియపరచాలన్నారు. అత్యవసరమైనచో జివిఎంసి టోల్ ఫ్రీ నెంబరు 1800 4250 0009 కు ఫోన్ చేసి ప్రజలు సమాచారాన్ని తెలియచేయాలని అదనపు కమీషనరు తెలిపారు.

నీటి కొళాయిలు బంద్

వర్షాలు కారణంగా తాగునీటికి ప్రజలు ఇక్కట్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలో తాగునీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందుల తలెత్తాయి. నీటి సరఫరా విభాగం ఉద్యోగులు, కార్మికులు ఒక్కరోజు సమ్మె కారణంగా నీటి సరఫరా వ్యవస్థ నిలిచిపోయింది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో తీవ్ర వర్షాలు కారణంగా విద్యుత్ సదుపాయం లేక బోర్లు పనిచేయక పోవడంతో నీటికి నానా అవస్థలు పడుతున్న ప్రజలకు త్రాగునీరు కుళాయిలు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. విశాఖలో అనేక ప్రాంతాల్లో బోర్లు పడని ప్రాంతాల్లో తాగునీటి కొళాయిలపైన ఆధారపడి జీవిస్తున్న ప్రజలకు నీటి సమస్యలు తీవ్రంగానే తలెత్తాయి. చుక్క నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్రమంతా వరదలు విపత్తుల సమస్యలతో అల్లాడుతుంటే తమ సమస్యలు పరిష్కరించాలని ఓ యూనియన్ సమ్మెకు దిగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా సాధారణ రోజుల్లోనే ప్రజలను వేధిస్తుంది. వర్షాలు కారణంగా తుఫాను పరిస్థితుల్లో ఉద్యోగులు విధులకు హాజరుకాకుండా అత్యవసర సేవగా ఉన్న త్రాగునీటి సరఫరా చేయకపోవడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరపక్క జీవీఎంసీ కమిషనర్ విశాఖలో లేకపోవ డంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. విజయవాడలో వరద సహాయ పనుల్లో సిబ్బంది అధికారులతో గత ఐదు రోజులుగా ఉన్న జీవీఎంసీ కమిషనర్ విశాఖలో త్రాగునీటి ఇబ్బందులపై దృష్టి సారించకపోవడంపై విశాఖవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విశాఖలో తుఫాను కారణంగా అనేక ప్రాంతాల్లో పునరావాస చర్యలు కూడా పూర్తిస్థాయిలో అందడం లేదని మండిపడుతున్నారు. పారిశుధ్యం క్షీణించి నగరంలో రోగాల తాకిడి అధికమైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ప్రజలందరికీ రోజు త్రాగునీరు అందిం చడంలో జివిఎంసి అధికారులు వైఫల్యం చెందుతున్నారని పలు కాలనీల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, కొళాయిలు బంద్ చేస్తున్నారని, రెండు మూడు రోజుల తర్వాత నీటి సరఫరా చేయడంతో ప్రజలకు కనీస అవసరమైన త్రాగునీరు కూడా జీవీఎంసీ అధికారులు అందించ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జీవీఎంసీ మొత్తం నీటి సరఫరా బంద్ కావడంతో ప్రజలు నీటి కోసం కోటి కష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆసుపత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - గాజువాక: అగనంపూడి, పెందుర్తి, గోపాలపట్నం, భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు 9రోజు నల్ల బ్యాడ్జి ధరించి ఒంటి కాళ్ళుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ సూపర్వైజర్లను (దళారీ) కాంట్రాక్టర్లు పెట్టడం వలన ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇవ్వకుండా వర్కర్ల జీవితాలతో వారు ఆటలాడుకుంటున్నారని లక్ష్మణ మండిపడ్డారు. గత 3 నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు, శాంతియుత పద్ధతిలో నిరసన ధర్నాలు చేస్తున్నప్పటికీ దీనిపై సంబంధిత జిల్లా కలెక్టర్,అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల కష్టార్జితం దాచుకున్న పిఎఫ్ డబ్బులు కూడా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు అందరికి ఈ నెల 15వ తేదీలోగా బకాయి ఉన్న అన్ని నెలల జీతాలు చెల్లించాలని, జీఓల ప్రకారం జీతాలు పెంచాలని, 2021 జూన్ నెల నుండి రావాల్సిన వేతనానికి తగిన పిఎఫ్ డబ్బులు మొత్తం లెక్కలు చెప్తూ జమ చేయాలని, ఇఎస్ఐ కార్డులు ఇవ్వకుండా ప్రతి నెల ఇఎస్ఐ పేరుతో వేతనంలో కట్ చేసుకున్న డబ్బులు మొత్తం తిరిగి శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులకు, సూపర్వైజర్లకు అందరికీ చెల్లించాలని ఈ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా 15వ తేదీ తరువాత నుండి విధులు బహిష్కరణ వంటి కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతాజీ, సంధ్య, చిన్న, జాన్సీ, నమ్మి లక్ష్మి, బుర్రమ్మ, గిరిజ, ఈశ్వరరావు, భవాని, వర లక్ష్మి పాల్గొన్నారు.

గంభీరం రిజర్వాయర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, జేసీ

విశాలాంధ్ర - ఆనందపురం: గత మూడు రోజులుగా వర్షాలకు మండలంలో వాగులు, వంకలు, గెడ్డలు, చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాలు పూర్తిగా నీట మునిగి అన్నదాతకు కన్నీటి వ్యధను మిగిల్చాయి. రోజురోజుకి నీటి ప్రవాహం పెరుగుతుండడం వల్ల అనేక జలాశయాలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో గంభీరం జలాశయాన్ని సోమవారం విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ క్షేత్రస్థాయి పరిశీలన చేసి నీటి ప్రవాహం రోజురోజుకీ పెరుగుతుండడంతో పర్యాటకులు ఎవరూ కూడా పరిసర ప్రాంతాలకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేషనల్ హైవే నుండి జలాశయానికి వెళ్లే రహదారి అధ్వాన స్థితిలో ఉండడం వలన ఇబ్బందులు పడుతున్నారని జివిఎంసి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తానని, అలాగే జలాశయం వద్ద ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసి స్థానిక పంచాయతీ వారు కూడా చొరవ తీసుకోవాలని అవసరమైతే వీఆర్ఏలను కూడా జలాశయం వద్ద గస్తీ ఉంచుతామని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో అక్కడికి చేరుకున్న భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు పరిస్థితిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని కింది ప్రాంతాల వారు జాగ్రత్తలు పాటించి జలాశయం గేట్లు ఎత్తివేయడంపై నీరు పోటెత్తడం వలన కింద ప్రాంత వాసులకు సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, భీమిలి ఆర్డిఓ భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, ఎంపీడీవో అడపా లవరాజు, ఏఈ సురేష్ కుమార్, విఆర్ఓ దేవరాజ్, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఉక్కును పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలని ఏ.ఐ.టి.యూ.సి. మిత్ర పక్షాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేశాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గల డి (వర్క్స్) బిల్డింగ్ వద్ద ఏఐటీయూసీ మిత్ర పక్షాల నాయకులు, కార్యకర్తలు భారీ ధర్నాను సోమవారం నిర్వహించారు. అనంతరం స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, రా మెటీరియల్ లేక ఉక్కు ఉత్పత్తి కుంటుపడిందని అన్నారు. ఉక్కు పరిస్థితిపై యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. రా మెటీరియల్‌ను సకాలంలో రప్పించక పోవడం మూలంగా ఉక్కు ఉత్పత్తి పరిస్థితి దిగజారుతూ జీతాలు సమయానికి చెల్లించలేని స్థితికి కంపెనీ వెళ్ళిందన్నారు. అనంతరం ఉక్కు సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జి యు.శ్రీధర్‌కు ఏఐటీయూసీ మిత్ర పక్షాల ప్రతినిధివర్గం వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో జె.రామకృష్ణ, ఎ.మసేనురావు, దొమ్మేటి అప్పారావు, డొక్కా నర్సింగరావు, జెవి నరేశ్ కుమార్, రామ్ కుమార్, కె.పరంధామయ్య, మోటూరు మహాలక్ష్మి నాయుడు, యు.రామక్రిష్ణ, అట్లూరి శివ రామక్రిష్ణ, కనుక రాజు, కాలేషా బాబా, నాగబాబు, మురళి కృష్ణ, బి.ఎం.ఎల్.నాయుడు, డి.దేముడు, జి.ఆనంద్, సీతా రామ రాజు, టి.ఎస్.ఎన్.చీకటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మేఘాద్రి గెడ్డను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెందుర్తి: విస్తృతంగా వర్షాలు కురుస్తుండటంతో పెందుర్తి మండల పరిధిలోని మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్‌ను పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడి మేఘాద్రిలో నీటిమట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మేఘాద్రిగెడ్డ పూర్తి సామర్థ్యం 61 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి నిల్వ 57. 4 అడుగులుగా ఉందని వెల్లడించారు. పరీవాహక ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా లేకపోవడంతో ప్రస్తుతం ప్రమాదం లేదని, అవసరమైతే గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేసేందుకు రెవెన్యూ, పోలీస్ అధికారులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. కాగా వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున మేఘాద్రిగెడ్డలో ఈతకు ఎవరూ దిగవద్దని కలెక్టర్ హెచ్చరించారు.

పల్లెవీధిలో కూలిన పెంకుటిల్లు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం, పల్లె వీధిలో గల డొక్కాడ లక్ష్మి అనే మహిళకు చెందిన పెంకు టిల్లు వర్షాలు కారణంగా ఆదివారం అర్ధరాత్రి కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడంతో కొంతమంది ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు, ఇతర గృహ పరికరాలు పూర్తిగా మట్టి లో కూరుకుపోయాయి. ఈ విషయంపై స్థానిక నాయకులు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు దృష్టికి తీసుకు వెళ్లడంతో సోమవారం ఆయన సంఘటన స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికను చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతే కాకుండా వారి కుటుంబానికి సాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటావని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మజ్జి సోమేశ్, మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు పోల్ రెడ్డి, నాయకులు ఉరుకటి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యవసర వస్తువులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశాఖపట్నం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతు బజార్ రైతులు, జ్ఞానాపురం న్యూ హోల్ సేల్ మార్కెట్ వ్యాపారులు సహకారంతో 10.5 మెట్రిక్ టన్నుల కూరగాయలు, నిత్యావసర సరుకులు సేకరించారు. వీటిని లారీలో జిల్లా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ చేతుల మీదగా పచ్చ జెండా ఊపి పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్, ఎస్టేట్ అధికారి జి.ప్రసాద్, టి.వై.నాయుడు, వ్యాపారులు వి.పరమేశ్వరరావు, కె.ప్రసాద్, పి.సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

ఈఓ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి దేవస్థానం ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇటీవల తుఫాన్ కారణంగా ఆలయం లోపల ప్రసాదాల కౌంటర్ల వద్ద దేవస్థానం భవనాలలో అన్నదానంలో భక్తులు వినియోగించే వివిధ వాటర్ ట్యాంకులను త్రాగే నీరు కలుషితం కాకుండా పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ వారితో కలిసి సమన్వయంతో చేసిన క్లోరినేషన్ ప్రక్రియలను పరిశీలించారు. వివిధ ప్రదేశాల్లో ఎక్కడ వర్షపు నీరు నిలవ ఉండకుండా అవసరమగు చర్యలు తీసుకోవాలన్నారు. తుపాన్ కారణంగా కొండపైన, కొండ దిగువ ప్రాంతాల్లో అన్ని చోట్ల శానిటేషన్, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కొబ్బరికాయ కొట్టే ప్రదేశాల వద్ద కొబ్బరి చిప్పలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, డిఈ హరి, ఏఈఓ ఆనంద్ కుమార్, నాగేశ్వరరావు, ఆలయ పర్యవేక్షణ అధికారి రమణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కర్రి స్వామి అంబేద్కర్ కాలనీకి సంబంధించిన ముద్దాడ ఎర్ని బాబు మేనకోడలు సందాల స్వాతికి ఆర్థికసహాయం చేశారు. ఈ విద్యార్థిని గత కొన్ని రోజులుగా ఊపిరి తీసుకునే లంగ్స్ రెండు

మార్గాలు మూసుకుపోవడంతో తీవ్ర అనారోగ్యం పాలై కేర్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. ఆమె యొక్క ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలుసుకొని చికిత్స పొందుతున్న సందాల స్వాతి దగ్గరికి వెళ్లి ఆమెకి మనోధైర్యం చెప్పడంతో ట్రస్ట్ తరఫున అధ్యక్షులు కర్రి స్వామి సొంత నిధులతో వైద్య ఖర్చులు నిమిత్తం 10000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో అడవివరం కోపరేటివ్ సొసైటీ పాలకవర్గ సభ్యులు లండ వెంకటరమణ, మునపర్తి శివ, ముద్దాడ ఎన్ని బాబు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో గంటా పర్యటన

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గోస్తనీ నది పరివాహక ప్రాంతంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పర్యటించారు. గొల్లవీధి గ్రామం దగ్గర శ్రీ రాధా కృష్ణ ఆలయం వద్ద నుంచి బాడా

కాలువ వరకు రక్షణ గోడ నిర్మాణం, గోస్తనీ నదిపై బ్రిడ్జి పూర్తి చేయాలని, గుమ్మడి పాపారావు ఇంటి దగ్గర నుంచి బోరింగ్ వరకు ప్రొటక్షన్ వాల్‌కై గ్రామస్తులు విన్నవించారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ, జనసేన కూటమి నాయకులు,కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

1307వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్షలు 1307వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే నిరాహార దీక్షలలో స్టీల్ సీఐటీయూ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2030 నాటికి 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కానీ దేశంలో నేటికీ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉత్పత్తి 150 మిలియన్ టన్నులకు మించి లేదని ఆయన అన్నారు. సెయిల్ నేటికీ 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తోందని, పది మిలియన్ టన్నుల విస్తరణ కోసం నేడు లక్ష కోట్లను వెచ్చిస్తున్నారని ఆయన వివరించారు. ఇదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం 7.3 మిలియన్ టన్నుల పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన రా మెటీరియల్స్ ఇవ్వకుండా సంక్షోభంలోకి నెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ కర్మాగారంలో 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేయడానికి అవసరమైన భూమి కలిగి ఉన్నదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటువంటి సంస్థను ప్రైవేటు వారికి కట్టబెట్టే ప్రభుత్వ ఆలోచనలు విరమించుకొని, దీన్ని సెయిల్‌లో కలిపితే విస్తరణ ఖర్చులు తగ్గి ప్రభుత్వ లబ్ధితో పాటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అన్నారు. కనుక ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి దీనిని సెయిల్‌లో కలపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వైటి దాస్, సీనియర్ నాయకులు డిసిహెచ్ వెంకటేశ్వరరావు, కె.వెంకట్రావు, యు.వెంకటేశ్వర్లు స్టీల్ సిఐటియు నాయకులు బి.అప్పారావు, ఆర్.వెంకట్రావు, పి.భానుమూర్తి, డిఎస్‌విఎస్ శ్రీనివాస్, విడివి పూర్ణచంద్రరావు, ఎంవి రమణ, గౌరీ శంకర్, ఎల్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఉద్యోగులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులపై పౌర గ్రంథాలయంలో సోమవారం విశాఖ ఉక్కు అధికారుల సంఘం, విశాఖ ఉక్కు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం, విశాఖ ఉక్కు ఓబిసి ఉద్యోగుల సంఘం, విశాఖ ఉక్కు రిటైర్డ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శులచే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు వేల మంది అధికారులు వున్నారని, ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ క్లిష్ట పరిస్థితుల్లో వుందన్నారు. వేతనాలను సకాలంలో అందించాలని, వి.ఆర్.ఎస్ పథకాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. విజయవాడ, తెలంగాణ, కేరళ వరద బాధితులకు సహాయాన్ని త్వరలోనే విరాళంగా ప్రకటిస్తామన్నారు. కూటమి ప్రభుత్వాలు వరద బాధితులను ఆదుకుంటున్నాయని కొనియాడారు. ప్లాంట్‌లో 30 వేల శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులు వున్నారని ఏడాది కాలంగా వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్ ఉత్పత్తి నాలుగు మిలియన్ టన్నుల నుంచి 2021లో ఆరు మిలియన్స్‌కి ఉత్పత్తి పెంచి లాభాల బాట పట్టిందన్నారు. స్టీల్‌ప్లాంట్ విస్తరణకు గనులు లేక సమస్య వుందన్నారు. గనులు అడిగితే ఎన్ఎండిసి గనులు వున్నాయని చెప్పి విస్తరణకు వెళ్ళడం వల్ల ముడి సరుకు కొరత వచ్చిందని విచారం వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో కూడా పని చేసి స్టీల్ సరఫరా చేశామని పేర్కొన్నారు. గత మూడేళ్లలో ఏడు మిలియన్ టన్నుల ఉత్పత్తి లేక 35 వేల కోట్లు టర్నోవర్ నష్టం వాటిల్లిందన్నారు. గంగవరం సమ్మె వల్ల ఉత్పత్తి తగ్గి మూడు వేల కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్నారు. కోక్ ఓవెన్, బ్లాస్ట్ ఫర్నేస్ దెబ్బ తినడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డామన్నారు. ప్రస్తుతం వర్కింగ్ క్యాపిటల్ ఇబ్బంది కూడా వుందన్నారు. స్టీల్ ప్లాంట్‌కి న్యాయం చేయాలని స్టీల్ కార్యదర్శిని కలిశామన్నారు. సెయిల్‌లో విలీనం కోసం కృషి చేస్తున్నామన్నారు. విలీనం వల్ల స్టీల్ ప్లాంట్‌కి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎనిమిదిన్నర గంటలు పని వేళలు పాటిస్తూ స్టీల్‌ప్లాంట్‌లో 39 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలియజేశారు. గతంలో 28 వేల కోట్ల టర్నోవర్‌తో 1020 కోట్ల రూపాయలు లాభాలు వచ్చాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రభుత్వం మూడు వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. 2007 నుంచి తమకు, 2012 నుంచి కార్మికులకు వేతన సవరణ జరగలేదన్నారు. దేశంలో గల 350 రకాల ప్రభుత్వ రంగ పరిశ్రమలు వుండగా రెండు క్యాటగిరీలు విభజన చేసి నాన్ స్ట్రాటజిక్ విభాగంలో వుండే పరిశ్రమలు మూసివేత, లేదా అమ్మేయడం చేస్తారని తెలిపారు. స్టీల్ ప్లాంట్ నాన్ స్ట్రాటజిక్ విభాగంలో వుండడం దురదృష్టకరమన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర కేబినెట్ సమా వేశంలో స్టీల్ ప్లాంట్ సమస్య కోసం చర్చించాలని కోరారు. మీడియా సమావేశంలో స్టీల్ ప్లాంట్ రిటైర్డు స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్టూరు శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మల్లయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యూట్రిషన్ బ్రాండ్ ఫిట్‌డేలో సూపర్ స్టార్ మహేష్ బాబు పెట్టుబడి

విశాలాంధ్ర/విశాఖపట్నం: భారతదేశంలో ప్రముఖ న్యూట్రాస్యూటికల్ స్టార్టప్ అయిన ఫిట్‌డే, సూపర్ స్టార్ మహేష్ బాబుకు చెందిన సంస్థ జిఎంబి ఎంటర్ టైన్‌మెంట్ నుంచి వ్యూహాత్మక పెట్టుబడిని అందుకున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ బాబు మాట్లాడుతూ పౌష్టికాహారం, చిరుతిండి న్యూట్రాస్యూటికల్ మార్కెట్‌లలో ఫిట్‌డే మార్గదర్శక కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఆవిష్కరణ నాణ్యత పట్ల వారి నిబద్ధత నా విలువలతో లోతుగా ప్రతిధ్వనిస్తుందన్నారు. వారి కొత్త ఉత్పత్తి శ్రేణి పరిశ్రమ ప్రమాణాలను సెట్ చేస్తుందని నేను నమ్ముతున్నానన్నారు. ఈ పెట్టుబడి వారి లక్ష్యాలు భారతదేశం అంతటా ఆరోగ్యం మరియు వెల్నెస్ ను ప్రభావితం చేసే వారి సామర్థ్యంపై నాకున్న బలమైన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది.." అని అన్నారు. ఫిట్‌డే వ్యవస్థాపకుడు, సీఈవో సురేష్ రాజు మాట్లాడుతూ "సూపర్‌స్టార్ మహేష్ బాబు యొక్క నమ్మకాన్ని సంపా దించినందుకు చాలా సంతోషంగా ఉన్నామన్నారు. అనేక పెట్టుబడి ప్రతిపా దనలను స్వీకరించినప్పటికీ, సరైన అవకాశాలను ఎంచుకోవడంలో వ్యూహా త్మకంగా వ్యవహరిస్తున్నాము, మా లక్ష్యాలకు అనుగుణంగా ఉండే భాగస్వామ్యాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తాము.." అని అన్నారు.

ఫైన్‌లపై ఉన్న శ్రద్ధ ....ట్రాఫిక్‌పై లేదు

ట్రాఫిక్ పోలీసులు తీరుపై ప్రజలు ఆగ్రహం

మానవ హక్కుల ప్రధాన కార్యదర్శి ఉదయ్ శంకర్

విశాలాంధ్ర - ఆనందపురం: నిత్యం చలానాలతో ట్రాఫిక్ పోలీసులు స్థానిక ప్రజలను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారని ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల రక్షణ మండలి ప్రధాన కార్యదర్శి మామిడి ఉదయ శంకర్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులకి ట్రాఫిక్ చలానాపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్‌ను నిరోధించడంలో లేదని మార్కెట్ పరిసరాల్లో నిరంతరం ట్రాఫిక్ పెరుగుతున్నప్పటికీ పోలీసులు శ్రద్ధ చూపడం లేదని స్థానిక రైతులపై చలానాల రూపంలో ఫైన్లు వేస్తున్నారని తెలిపారు. జంక్షన్ పరిధిలో వాహనాలతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉందని, ఫోన్లతో వాహనదారులను ఫోటోలు, అధిక చలానాలతో తీవ్రమైన ఇబ్బందులు పెడుతున్నారని మార్కెట్‌కి వచ్చే రైతులకు, ప్రజలకు చలానాలపై మినహాయింపు ఇవ్వాలని కోరారు.

పంటలను పరిశీలించిన ఏవో సంధ్య రత్నప్రభ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో పెద్ది పాలెం, బోని, పొడుగుపాలెం, వ్యవసాయ పంటలను ఆనందపురం మండలం వ్యవసాయ అధికారి సంధ్యరత్నప్రభ సోమవారం పరిశీలన చేశారు. ముంపునకు గురైన పంటలను పరిశీలించి అనంతరం పూర్తిస్థాయి నివేదికను ఒకటి రెండు రోజుల్లో అంచనా వేసి జిల్లా అధికారులకు అందజేస్తామని ఏవో తెలిపారు కార్యక్రమంలో వీఆర్వో అప్పల రెడ్డి , స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు హెచ్‌ఆర్ క్లబ్ రూ.25 వేలు విరాళం

విశాలాంధ్ర - విశాఖపట్నం: విజయవాడ వరద బాధితులకు నగరానికి చెందిన హెచ్‌ఆర్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ రూ. 25001/- విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆ నగదు మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ కి చేరవేశారు. ఈ మొత్తం సమకూర్చడానికి పలువురు దాతలు సహకరించినట్టు ఆ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తపల్లి శివ వరుణ్, కార్యదర్శి ఉమ్మడి సునీల్, ఉపాధ్యక్షుడు శ్రీ సుధా, సంయుక్త కార్యదర్శి సునీల్, సభ్యులు రమణమ్మ, కోటా శ్రావణ్ తెలిపారు. తమ ట్రస్టు తరుపున పలు సందర్భాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా వెల్లడించారు.

ఆర్జి మార్షల్ అవార్డును సొంతం చేసుకున్న గాయత్రి విద్యా పరిషత్ విద్యార్థులు

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రముఖ కంప్యూటర్ శాస్త్రవేత్త ఆర్జి మార్షల్ అవార్డును నగరంలోని గాయత్రి విద్యా పరిషత్, ఎం.ఎల్.బి.టి పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమ రాజు, ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం బీచ్ రోడ్‌లోని పాఠశాల ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య పి.సోమరాజు మాట్లాడుతూ ప్రపంచ కంప్యూటర్ దిగ్గజం ఆర్జి మార్షల్ వ్యక్తిగతంగా పాఠశాలను సందర్శించి ఈ అవార్డులను ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి ఏటా పదవ తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ అవార్డులతో పాటు ప్రశంసా పత్రం నగదును ఇస్తామని చెప్పారు. గత పదేళ్లుగా విద్యార్థులకు ఈ అవార్డులు ఇస్తున్నట్లు ఆయన వివరించారు. 2024 మార్చ్‌లో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఏఎస్ఎన్‌జి శ్రావ్య శ్రీ, పతివాడ గాయత్రి, ఎం మిహిరా, రాజాన భవ్య, మాకిరెడ్డి సాద్విక లకు ఈ అవార్డులు లభించాయి. గాయత్రి విద్యా పరిషత్ సంయుక్త కార్యదర్శి డివిఎస్ కామేశ్వరరావు పర్యవేక్షణలో పాఠశాల ప్రిన్సిపల్ కే మధురవాణి విద్యార్థులకు అవార్డులను బహుకరించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

డైట్‌లో ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: ప్రపంచ అక్షరాస్యత దినోత్సవంను భీమిలి డైట్ హాస్టల్లో ఘనంగా నిర్వహించారు భారతదేశంలో అక్షరాస్యత శాతం స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి పెరుగుతూ వస్తుందని ఇప్పుడు అది 74.04 శాతంగా ఉందని, ఆంధ్రప్రదేశ్లో జాతీయ సగటు కంటే ఇంకా తక్కువ శాతం అక్షరాస్యత ఉందని, నిరక్షరాస్యులుగా ఉన్న మిగతా వారందరూ అక్షరాస్యులుగా మారడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారిని ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని అన్నారు. ఛాత్రోపాధ్యాయులు తమ కుటుంబంలో తమ గ్రామాల్లో తనకు తెలిసిన వారెవరు కూడా నిరక్షరాస్యులుగా మిగలకూడదని, ఆ రకమైన అంకితభావంతో పనిచేస్తే శతశాతం అక్షరాస్యతను సాధించగలమని అన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, అధ్యాపకుడు గొట్టేటి రవి ఛాత్రో పాధ్యాయులతో వారికి తమ ప్రాంతాలలో పరిచయం ఉన్న వారిలో వయోజనులైన నిరక్షరాస్యులు ఎవరెవరో గుర్తించి, వారి పేర్లు పుస్తకంలో రాయించి, వారిలో నెల రోజులకి ఐదుగురుకు చొప్పున అక్షరాలు నేర్పడానికి సిద్ధపడేలాగున ఛాత్రోపాధ్యాయులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, అధ్యాపకురాలు జె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఓనం పండుగ సందర్భంగా అమెజాన్ డాట్ ఇన్‌లో ఓనమ్ స్టోర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: అమేజాన్ ఇండియా దేశవ్యాప్తంగా ఓనమ్ స్టోర్ నో అందుబాటులోకి తీసుకువచ్చింది. పండగ సందర్భంగా సంప్రదాయబద్ధమైన దుస్తుల నుండి పూజా అవసరాల వరకు సరికొత్త ఎలక్ట్రానిక్స్, ఉపకరణాలు, హెూమ్ డెకార్ వరకు, కస్టమర్స్ అన్ని శ్రేణులలో ఉత్తేజభరితమైన ఆఫర్లను పొందవచ్చు. సృజనాత్మకమైన కస్టమైజబుల్ ఈ-గిఫ్ట్ కార్డ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. అమేజాన్ ప్రైమ్ సభ్యుల కోసం, పండగ అనుభవం కొత్త స్థాయిలను చేరింది - మరింత సౌకర్యవంతమైన బహుమానపూర్వకమైన షాపింగ్ అనుభవం కోసం ప్రత్యేకమైన డీల్స్ అత్యంత వేగవంతమైన డెలివరీని తీసుకువచ్చారు. ఓనమ్ సంబరాలను మెరుగుపరచడానికి నొబిలిటి కేరళ సంప్రదాయ విలక్కు పంచమహల్ ఆయిల్ ల్యాంప్, ఆర్ట్ వర్కో సాలిడ్ బ్రాస్ గజలక్ష్మి ఆయిల్ దియ లార్జ్ దీపం, పీకాక్ డిజైన్ హ్యాండ్ క్రాఫ్టెడ్ ల్యాంప్ బై డిజైన్ శాస్త్ర, ఫుల్ లగ్జరీ ఇన్ సెన్స్ స్టిక్స్, అక్షయకల్ప ఆర్గానిక్ ఘీ, కేరళ ఇన్ స్టెంట్ సాద్య పలద మిక్స్, అమేజాన్ బ్రాండ్ సాలిమో 6 పీస్ నాన్-స్టిక్ కుక్ వేర్ సెట్ తదితర మరెన్నో పరికరాలు ఉంచారు.

వినాయక ఉత్సవాల్లో కార్పొరేటర్ ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం సమీపంలోని శివగాయత్రి నగర్‌లో భారీ మండపంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య స్వామిని స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు దర్శించుకున్నారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఉత్సవాల్లో పాల్గొన్న ముమ్మన దేముడు గణపయ్యకు విశేష పూజలు చేసారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలకృష్ణ, అప్పారావు, సత్యారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి: ఎమ్మెల్యే వంశీ కృష్ణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జర్నలిస్టుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో అల్లిపురంలోని తన కార్యాలయంలో ఘనంగా జర్నలిస్ట్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తాను కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం కూడా జర్నలిస్టుల అభివృద్ధికి కృత నిశ్చయంతో ఉందన్నారు. డాక్టర్ కందుల నాగరాజు ఘనంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో తాను ఒక అతిథిగా పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి జర్నలిస్టులు ఒక వారిదిగా పనిచేస్తున్నారని వెల్లడించారు. సమాజానికి చేస్తున్న వారి సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ఇప్పటికీ జర్నలిస్టులలో చాలామందికి సొంత ఇల్లులు లేని వారు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇల్లు స్థలాలు ఇచ్చేందుకు ఆలోచిస్తుందని చెప్పారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా విశాఖ జర్నలిస్టులకు జర్నలిస్టు డే సందర్భాన్ని పురస్కరించుకుని అతిథులు చేతుల మీదుగా సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన పరిధి మేరకు జర్నలిస్టుల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, సింహాచల దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబెర్ గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ డాక్టర్ కందుల నాగరాజు చేస్తున్న సేవలు స్లాఘనీయమైనవని కొనియాడారు. వార్డు పరిధి మేరకే కాకుండా దక్షిణ నియోజకవర్గం మొత్తం అంతా తన సేవలను విస్తరించాలని కోరారు.

ఇందులో భాగంగా జర్నలిస్టులను సత్కరించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. జర్నలిస్టులకు ఏ కష్టం వచ్చినా తాను ముందు ఉన్నానని అంటూ జర్నలిస్టులందరికీ సహాయం చేసే మంచి వ్యక్తిత్వం డాక్టర్ కందుల నాగరాజుది అని కొనియాడారు. కార్యక్రమంలో 60 మంది జర్నలిస్టులను అతిధుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్ రెడ్డి, బివి రామ్, సాలివాహన, డాక్టర్ సునీల్, కందుల కృష్ణ, కందుల రాజశేఖర్, నారా నాగేశ్వరరావు, మద్ది రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలి



విశాలాంధ్ర- విశాఖపట్నం: రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం.. కేజీహెచ్ క్లాక్ టవర్ వద్ద కాంట్రాక్ట్ నర్సులు సోమవారం చేపడుతున్న నిరసనకు తెలుగు శక్తి సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 115 ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 115 రద్దు అయితేనే కాంట్రాక్టు నర్సులకు న్యాయం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర ఆరోగ్యపదాయని కే జి హెచ్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11,500 మంది నర్సులు (మేల్ /ఫీమేల్) కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నారన్నారు. నర్సింగ్ విద్యలో మూడు సంవత్సరాల డిగ్రీ చేసినవారు, పీజీ చేసినవారు, పీహెచ్డీ చేసినవారు.. కోవిడ్ కు ముందు నుంచి కూడా తమ అమూల్యమైన సేవలను అందిస్తున్నారు అన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల కారణంగా సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎం లకు ఎం పి హెచ్ డబ్ల్యూ పేరుతో నామమాత్రపు శిక్షణ ఇచ్చారన్నారు. వారు ఎంత శిక్షణ పొందినప్పటికీ నర్సింగ్ లో డిగ్రీ, పీజీ, పీహెచ్డీ చేసిన వారితో సమానంగా నాణ్యమైన వైద్య సేవలను ఏఎన్ఎంలు అందించలేరని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సూర్య కళకు ప్రభుత్వం 50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి

కోవిడ్ సమయంలో ఒక చిన్నారిని కాపాడటం కోసం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ సూర్య కళ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కాపాడి తన కళ్ళు పోగొట్టుకొని, కానీ గత ప్రభుత్వం ఎటువంటి ఎక్స్గ్రేషియా ప్రకటించలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ సూర్య కళకు ప్రభుత్వం 50 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కోరారు. ఈ కార్యక్రమంలో జి.శాంతమ్మ, బి.శాంతి కుమారి, డాక్టర్ పప్పూర్ నికుంజ్, వి.వెనిలా, ఎస్.వరలక్ష్మి, ఎన్.శోభారాణి, అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, నర్సింగ్ స్టూడెంట్లు పాల్గొన్నారు.

ఆబోతువానిపాలెం కల్వర్టు పరిశీలన

విశాలాంధ్ర - ఆనందపురం: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆబోతు వానిపాలెం కల్వర్టు పూర్తికానందున వర్షాకాలంలో ఎర్ర కణమాం, గొల్లల కణమాం పరిసర ప్రాంత ప్రజలకు వర్షాకాలంలో రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు, కల్వర్ట్ నీటి తాకిడికి గురికావడంతో సమాచారం అందిన వెంటనే సోమవారం ఉదయం మండల తాసిల్దార్ శ్యామ్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బందితో అక్కడ చేరుకొని ముందస్తు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టారు. పరిశీలనలో ఆర్ఐ మణికంఠ, వీఆర్వో లక్ష్మి రైతులు తదితరులు పాల్గొన్నారు.

టాటా ప్లే తెలుగు క్లాసిక్స్‌లో ఎందరో మహానుభావులు

విశాలాంధ్ర - విశాఖపట్నం: తెలుగు సినిమా ప్రేమికుల హృదయాన్ని, ఆత్మను అలరించేందుకు విలక్షణమైన, సరికొత్త సెలబ్రిటీ టాక్ షో, 'ఎందరో మహానుభావులు' కార్యక్రమాన్ని టాటా ప్లే తెలుగు క్లాసిక్స్ ప్రసారం చేస్తోంది. నటుడు, రచయిత, దర్శకుడు పరుచూరి గోపాల కృష్ణ, జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీత నటి శారద, నటుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు మురళీ మోహన్, దర్శకుడు, సినీ కథా రచయిత రేలంగి నరసింహారావు, తనికెళ్ల భరణి వంటి తెలుగు ఇండస్ట్రీ ప్రముఖులు, దిగ్గజాలు తమ వృత్తి జీవిత ప్రయాణాన్ని ఈ చాట్‌షోలో వీక్షించవచ్చు. ఈ చాట్ షోకు తొమ్మిది సార్లు నంది అవార్డులు, రెండు సార్లు ఫిలింఫేర్ అవార్డ్స్ సౌత్ విజేత, ప్రతిభావంతురాలు, ప్రముఖ తెలుగు నేపథ్య గాయని, డబ్బింగ్ కళాకారిణి సునీత ఉపద్రష్ట వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. టాటా ప్లే తెలుగు క్లాసిక్స్ లో లో ఎందరో మహానుభావులు పేరిట ప్రతి శని, ఆదివారాలు రాత్రి 7:30 నుంచి 8:00 వరకు ప్రసారం చేస్తుంది.

నెల్లిముక్కులో అన్నసమారాధన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: స్థానిక 75 వార్డు నెల్లిముక్కు గ్రామంలో మంగళంపల్లి నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాజువాక, 75వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పులి లక్ష్మీబాయి రమణారెడ్డి అన్నసమారాధన ప్రారంభించారు. సిద్ది వినాయక

నవరాత్రి వేడుకలలో సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో స్వామీ వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కొరిబిల్లి శ్రీనివాసు, దొమ్మేటి అప్పారావు, కోరిబిల్లి గోవిందరావు, నీలాపు అప్పలరెడ్డి, కొరిబిల్లి అప్పారావు, నగేష్, గంగాధర్, అప్పారావు, సోము నాయుడు పాల్గొన్నారు.

భీమిలి లా అండ్ ఆర్డర్ ఎస్ఐగా ప్రసాద్

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ నూతన ఎస్ఐగా గొండేలా ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. గతంలో పీఎం పాలెం క్రైమ్, శ్రీకాకుళం జిల్లా బూర్జ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. భీమిలి ఎస్ఐగా కూడా పనిచేశారు. మరోమారు భీమిలి లా అండ్ ఆర్డర్ ఎస్ఐగా విధులు నిర్వర్తించేందకు నగర పోలీసు కమిషనర్ శంక బ్రతా భాగ్చీ ఉత్తర్వులు జారీచేశారు. భీమిలి సీఐ సహాయ సహకారాలతో క్రైమ్ రేట్ తగ్గించే ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.